ప్రజాశక్తి

శనివారం 2 నవంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు

బాల్య వివాహాలు తగవు

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్:బాల్య వివాహాలు చేయవద్దని ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. శుక్రవారం గుమ్మకోట సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. పిల్లలకు బాల్యవివాహాలు చేసి వారి భవిష్యత్‌ని నాశనం చేయ వద్దన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాగి అప్పారావు, వీఆర్వో కోటి, పిఓ సంతోష్ కుమారి, పంచాయతీ సెక్రటరీ ధర్మ పాల్గొన్నారు.

హాజరైన అధికారులు

జనావాసాల నడుమ మద్యం షాపులు

-ఆటో స్టాండ్ సమీపాన ఏర్పాటు

-భయపడుతున్న గిరిజనులు

- ఎత్తివేయాలని మహిళల వినతి

ప్రజాశక్తి- అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయ టౌన్షిప్ లోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసి ఉన్న వైన్ షాపులు ఎత్తివేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన వైన్ షాపులు అరకులోయలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి.

జననివాసాల్లో, ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరలో మద్యం షాపు ఉండకూడదని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అరకులోయ నడిబొడ్డున మెయిన్ రోడ్డులో పెదలబుడు పంచాయతీ కార్యాలయం ఎదురుగా వైన్స్ ఏర్పాటు చేశారు. దీంతో, మెయిన్ రోడ్‌లో రాకపోకలకు సాగించే వాహన చోదకులు, పర్యాటకులు, మహిళలు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వైన్‌షాపు ఎదురుగా వివిధ గ్రామాల నుంచి అరకులోయకు వచ్చిన ప్రజలు సంతరోజున ఇక్కడ కూర్చోవడం అలవాటు. వైన్ షాప్ ఏర్పాటుతో ఆ పరిస్థితి ఇప్పుడు లేకుండా పోయిందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఈ షాప్ ఎదురుగానే పెదలబుడు ఆటో స్టాండ్ కూడా ఉంది. ఆటో ఎక్కడానికి గిరిజన మహిళలు రావాలంటేనే వైన్ షాప్‌తో భయపడిపోతున్నారు. అరకులోయ నడిరోడ్డులో వైన్ షాపు ఉండటంతో మందుబాబుల వాహనాలు రోడ్‌లోనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ కూడా ఏర్పడుతుంది. దీంతోపాటు వైన్ షాప్‌కు ఆనుకుని కొండవీధి, గిరిజన సంఘం కార్యాలయానికి వెళ్లే స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గిరిజన సంఘం కార్యాలయంలో ప్రతి రోజు పదుల సంఖ్యలో వివిధ గ్రామాల గిరిజనులు తమ సమస్యల కోసం గిరిజన సంఘం నాయకుల దగ్గర వచ్చి పోతుంటారు. ఇప్పుడు మందు బాబులకు భయపడి ఆ మార్గములో వెళ్లడానికి భయపడుతున్నారు. వైన్ షాపు రోడ్డు లోనే ఉండడంతో సంత రోజు శని, ఆదివారాల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ షాపులు ఎత్తి వేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు గిరిజనులు తెలిపారు.

రోడ్డుకు ఆనుకుని ఆటో స్టాండ్ సమీపాన ఉన్న మద్యం షాపు

అదేవిధంగా తసిల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మరో వైన్ షాప్ కూడా తహసిల్దార్ కార్యాలయం సమీపంలోనే ఉంది. కార్యాలయంలో వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికి తోడు ఎదురుగానే అంబేద్కర్ విగ్రహం పార్క్ ఉండటంతో అంబేద్కర్ విగ్రహంలో నిరసన తెలియజేయడానికి వెళ్లే ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడ బ్రాందీ షాపుల్లో బీరు బ్రాందీలు కొనుగోలు చేసిన వ్యక్తులు అంబేద్కర్ విగ్రహం వద్ద కూర్చుని తాగి అక్కడే సీసాలు పగలగొట్టి పడవేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అరకులోయ మెయిన్ రోడ్డులో ఉన్న మద్యం దుకాణాలను ఎత్తివేసి ఊరికి దూరంగా పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పాడేరు ఐటీడీఏ పీవో, కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. జనసంచారం నిత్యం ఉండే ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ లో వైన్ షాపు ఏర్పాటు చేయడంతో గిరిజనుల నుంచి, గిరిజన సంఘం నాయకుల నుంచి ఐటీడీఏ పిఓ కు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆ షాపును తొలగింపుకు ఆదేశించారు. దీంతో ఆ షాపును కూడా ఊరికి దూరంగా తరలించారు.

తల్లి ఒడిలోనే ప్రాణాలు విడిచిన పసికందు

-విలపిస్తున్న తల్లి

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రభుత్వం మాతా శిశు మరణాలు తగ్గించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ పసికందుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. మండలములోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా పంచాయతీ గేటువలస గ్రామానికి చెందిన వంతల సోని పుష్ప అనే గిరిజన మహిళకు జన్మించిన నాలుగు నెలల పచికందు మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య సేవలు అందించినప్పటికీ ఆరోగ్యం విషమించి గురువారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తల్లి ఒడిలో లాలించిన పసిబిడ్డ కల్లారా చేతుల్లోనే ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

ఇది ఇలా ఉన్నప్పటికీ గత నాలుగు ఐదు నెలల నుండి ఇదే గ్రామానికి చెందిన ఇప్పటికే ముగ్గురు పసికందులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి ఈ గ్రామమే కాదు మండలంలోని పలు మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొంది. అనేకమంది సకాలంలో వైద్య సేవలు అందక మృత్యువాతకు గురవుతున్న ఘటనాలు రోజురోజుకు ఎదురవుతున్న పరిస్థితి ఏర్పడింది .ఇప్పటికైనా ప్రభుత్వం మాతా శిశు మరణాలు అరికట్టేందుకు కృషి చేయాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.

డిఎస్‌పిగా సాయి ప్రశాంత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం సబ్ డివిజన్ డిఎస్‌పిగా జి.సాయి ప్రశాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2022 ఏపీపీఎస్ బ్యాచ్‌కు చెందిన సాయి ప్రశాంత్ గ్రేహౌండ్స్‌లో పని చేస్తూ రంపచోడవరం డిఎస్పీగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు నూతన డిఎస్‌పిని రంపచోడవరం డివిజన్ పరిధిలోని చెందిన సిఐలు, ఎస్సైలు గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్న గంజాయి అక్రమ రవాణాలను అరికట్టేందుకు తన శాయశక్తుల ప్రయత్నిస్తానని చెప్పారు. గంజాయి విక్రయదారులు, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లోని టూరిస్టు ప్రాంతాలకు పర్యాటకులు అధికంగా వస్తున్నారని, వారు మద్యం సేవించి వాహనాలను నడపడం, ప్రమాదాలకు గురికావడం జరుగుతుందని, అలా కాకుండా క్షేమంగా ఇంటికి వెళ్లే విధంగా ఉండాలని సూచించారు. తాము కూడా ప్రజల్లో మమేకమైనందుకు ఫ్రెండ్లీ పోలీసు కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి

పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన జూదరులు

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కినపర్తి పంచాయతీ భీమవరం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశామని సీఐ పీ.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు, మంప ఎస్ఐ కే.శంకరరావుతో కలిసి పేకాట శిబిరంపై దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు కార్లు, రూ.73,900 నగదు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సిఐ వెంకటరమణ తెలిపారు.

దీపం -2 పథకానికి అర్హుల గుర్తింపు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు, : దీపావళి సందర్భంగా దీపం -2 పథకంలో భాగంగా జిల్లాలో 1,46,508 మందిని అర్హులుగా గుర్తించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. శుక్రవారం స్థానిక కాఫీ హౌస్ లో దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ, లబ్దిదారులు ఇ-కేవైసి చేయించుకోవాలని సూచించారు. ఈ పథకం కింద ప్రతి ఏడాది నాలుగు నెలలకు ఒకసారి చొప్పున మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హతలు ఉంది మంజూరు కాకపోతే మీ కోసం కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మీకోసం లో రహదారి, తాగు నీటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపిన కలెక్టర్ పిఎం జన్ మన్ పథకం కింద రూ 239 కోట్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తరుపున వెంటనే అందుకు తగ్గ మాచింగ్ గ్రాంట్ కు ముఖ్యమంత్రి చొరవతో ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఎన్ఆర్ఇజిఎస్ కింద సుమారు రూ .400 కోట్ల వరకు మూడు ఐటిడిఎల ఫరిధిలో ఖర్చు చేయవచ్చని, అందులో 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద వస్తుందని తెలిపారు. ఇప్పటికే రూ.250 కోట్ల విలువైన పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని 1200 నివాస ప్రాంతాలలో అన్ని ప్రాంతాలను వాహనాలు తిరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రాజెక్ట్ చేపట్టడానికి ముఖ్యమంత్రి ఆసక్తిగా ఉన్నారని ఆ దిశలో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, గిరిజనుల చీకటి బతుకులు పారద్రోలి వారి కుటుంబాలలో వెలుగులు నింపే దిశగా ముఖ్యమంత్రి దీపం-2 పథకాన్ని ప్రారంభించారని గిరిజనుల కష్టాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఫించన్లను సకాలంలో పంపిణీ చేస్తున్నారని, గహాలు మంజూరు చేస్తున్నారని, గిరిజనులకు అవసరమైన అన్ని సమకూరుస్తూ సహకరిస్తున్న ముఖ్యమంత్రికి మనందరమూ తోడ్పాటును అందివ్వాలని కోరయు.

మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేసారని గుర్తు చేసారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రధాన సమస్యలైన త్రాగు నీటు, రహదారి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రత్నకుమారి, వైస్ ఎంపిపి జి.శివకుమార్, ఎస్టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బి. నాగరాజు, సర్పంచ్ ఉషారాణి, పౌర సరఫరాల డిఎం గణేష్ కుమార్, జిసిసి డిఎం సింహాచలం, బిఎం వెంకటేష్, గ్యాస్ ఏజన్సీ మేనేజర్ శ్రీనివాస కుమార్, డిటిలు ప్రశాంత్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న 108 ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో 108 ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- దేవీపట్నం

తమకు బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ 108 ఉద్యోగులు శుక్రవారం దేవీపట్నంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యానికి గురైనప్పుడు, ప్రమాదాలు సమయంలో 24 గంటల్లో అత్యవసర సేవలు అందించే 108 సిబ్బంది దీపావళి పండగా రోజున కూడా జీతాలు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 108 ఉద్యోగులకు అరబిందో యాజమాన్యం మూడు నెలల నుండి జీతాలు చెల్లించలేదన్నారు. సంఘం రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా పది రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు కెవివి.సతీష్, ఆర్‌సిహెచ్.జోగేష్, సిహెచ్.వెంకటేశ్వరరావు, వైఎంఎస్.దొర పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని కరీముఖిపుట్ పంచాయతీ తుమ్మలపనస గ్రామం లో సిపిఎం మండల కమిటీ నాయకుడు గల్లెల నారాయణ శుక్రవారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం పనిదినాలు 200 రోజులకుపెంచాలని, మంచి నీరు, సీసీ రోడ్డు, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకుడు జీనబంధు మాట్లాడుతూ, ఉపాధి హామీపథకం పనులు చేస్తున్నప్పటికీ నేటికీ 28మంది లబ్ధిదారులకు సొమ్ము అందలేదన్నారు.ఐదు నెలల నుండి మంచినీరు సమస్య ఉన్నా అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహించారు. తక్షణమే తారునీరు సమస్యను పరిస్కారం చేయాలనీ ఆయన డిమాడ్ చేసారు. గ్రామంలో వీధి దీపాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీ సిదేశ్వరావు, సోమా, మత్స్యరాజు, నాగేశ్వరరావు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

అక్రమ కట్టడాలు, ఇసుక రవాణాపై ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు, గెడ్డ నుండి అక్రమంగా ఇసుక రవాణాపై సబ్ కలెక్టర్ పిర్యాదు చేశామని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ,. సిపిఎం బీంపోలు, గుమ్మకోట పంచాయతీ నాయకులు జె. వెంకటరమణ, . శ్రీను గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గుమ్మ కోట పంచాయతీ బిల్లకోట గ్రామంలో పర్యటించారు. మైదాన ప్రాంత లకు చెందిన గిరిజనేతరులు అక్రమ కట్టడాలు నిర్మించడంపై ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందని ఆయన తెలిపారు. తక్షణమే అక్రమ కట్టడాలు, ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని కోరామని తెలిపారు

విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తాం

ప్రజాశక్తి -అనంతగిరి:విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని కాశీపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గిరిజనులు చేపట్టిన ఆందోళనకు విద్యుత్ శాఖ జిల్లా ఇంజనీరింగ్ . ప్రసాద్, డిఈఇ. విఎన్ అప్పారావు స్పందించారు. రొంపల్లి పంచాయతీ పరిధి చిన్నకొనెల. భూరిగలో పర్యాటించారు. అనంతరం గిరిజనులతో విద్యుత్ మీటర్ల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.సుమారు 60 .కుటుంబాల ఇళ్లకు నాలుగు ఇల్లుకు మాత్రమే విద్యుత్ మీటర్లు బిగించారని తెలిపారు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు.అధికారులు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది తప్పిదంతో ప్రతి ఇంటింటా విద్యుత్ మీటర్లు కల్పించలేకపోయామన్నారు. అర్హులైన గిరిజనులు ఆధార్ కార్డు, అప్లికేషన్ సమర్పిస్తే విద్యుత్ మీటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ. లింగేశ్వరస్వామి పాల్గొన్నారు

టెంట్ నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి

ప్రజాశక్తి -అరకులోయ:ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో క్యాంపింగ్ టెంట్లు నిర్వహించే టెంట్ నిర్వాహకులు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అరకులోయ ఎంపీడీవో లవ రాజు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అనేక చోట్ల టెంట్లు ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు అనుమతులు తీసుకోలేదని, పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్ ఆదేశాల మేరకు మూడు నెలలకు సంబంధించిన టెంట్ రుసుము ఐటిడిఏ నిర్ధారించిన ప్రకారం అప్లికేషన్లు సమర్పించి చెల్లించాలని ఆయన అన్నారు. క్యాంప్లింగ్ స్థలంలో మంచినీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. టెంట్లో బస చేసే పర్యాటకుల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని వారి ఆధార్ కార్డులు విధిగా తీసుకోవాలని ఆయన సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, డిజె సౌండ్ సిస్టం లు వాడరాదని ఆయన స్పష్టం చేశారు.

ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి

4న చలో ఐటిడిఎను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే మెగా డీఎస్సీ వల్ల గిరిజనులకు ఎటువంటి ఉపయోగం లేదని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిమల్లి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ఇప్పటికే డీఎస్సీ శిక్షణ పొంది టీచర్ పోస్టుల కోసం నిరీక్షణతో ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లటమే అవుతుందన్నారు. ఇది మెగా డిఎస్‌సి తప్ప గిరిజన నిరుద్యోగులకు ఒక టీచర్ పోస్ట్ కూడా రాదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రకటించిన 6100 డీఎస్సీ పోస్టుల్లో 518 నోట్‌పై చేస్తే ఆదివాసీలకు కేటాయించింది కేవలం 38 మాత్రమేనని పేర్కొన్నారు. నేడు టిడిపి కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 3కి చట్టబద్ధత కల్పిస్తూ ఏజెన్సీ స్పెషల్ డీఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకసారి మెగా డీఎస్సీ తీస్తే మరోసారి స్పెషల్ డీఎస్సీ కోసం ఆలోచించే అవకాశం ఉండదని, ఈ విషయాన్ని నిరుద్యోగ యువత ఆలోచించాలని కోరారు. అందుకే ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయంపై యువత, అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం సంగతి ఏంటో తేల్చాలని గిరిజన సంఘం కోరుతుందని చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ నెల 4న సోమవారం జరుగుతున్న చలో ఐటీడీఏ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు టి.శ్రీనివాస్, ఎం.అబ్బాయ్ రెడ్డి, దుర్గ ప్రసాద్, ఎస్. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లిరెడ్డి

జిఒ 3 పునరుద్ధరణ, డిఎస్‌సిపై ఎమ్మెల్యే స్పందించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించడం, నవంబర్ 6న విడుదలయ్యే మెగా డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులపై స్పష్టత తదితర డిమాండ్లపై రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని రెండుసార్లు కలిసి వినతిపత్రం ఇచ్చామని, వాటిపై ఆమె స్పందించాలని ఆదివాసీ నిరుద్యోగ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం జేఏసీ ఆధ్వర్యాన నిరుద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ అక్టోబర్ 16న ఒకసారి, 23వ తేదీన మరో సారి ఎమ్మెల్యేను కలిసి విన్నవించామని, నాడు ఆమె సానుకూలంగా స్పందించి కచ్చితంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ తేదీ దగ్గరపడుతోందని, నేటి వరకు తమ డిమాండ్లపై స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాటలతో సరిపెడుతున్నారు తప్ప ఆచరణలో పెట్టడం లేదని వారు ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించకపోతే భవిష్యత్తులో ఏజెన్సీ గ్రామాల్లో ఎమ్మెల్యేకి వ్యతిరేక ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం చేయాలని చూస్తే గత ఎమ్మెల్యేలకు ఎదురైన చేదు అనుభవాలే ప్రస్తుత ఎమ్మెల్యేలకు రాబోయే కాలంలో ఎదురుకాక తప్పదని హెచ్చరించారు. ఎస్‌టి రిజర్వు సీటులో గిరిజనుల ఓట్లతో గెలిసిన ఎమ్మెల్యే నేడు ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంటే నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నిరుద్యోగులు పాయం రతన్ కుమార్, సోడే చందు, పులి అశోక్, రాంబాబు, దుర్గాప్రసాద్, విశ్వంత్ కుమార్, చంటి, ప్రసాద్, మోజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజన నిరుద్యోగులు

పింఛన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీలో అలసత్వం వహించేవారిపై వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మండలంలోని గంగవరం గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు ప్రాజెక్ట్ అధికారి చేతులు మీదుగా పింఛన్లు అందజేయడం జరిగింది. అనంతరం గంగవరం గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజు మెనూ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి శుక్రవారం రంపచోడవరం ఎన్టీఆర్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పంఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి పి మోహన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వై నిరంజనీ దేవి, టిడిపి నాయకులు కే చక్రపాణి, రంపచోడవరం ఎంపిడిఒ శ్రీనివాస దొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు :- జిల్లాలో లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పంఛన్లను పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పాడేరు మండలం లగిసిపల్లి గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1,24,354 మంది వివిధ రకాల ఫింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వారి ఇంటి వద్దకే ఒకటవ తేదీనే ఫింఛన్ చెల్లించే విధంగా అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. అబ్దిదారులు ఫింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి, డిఆర్డిఎ పిడి వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

శిక్షణలో మాట్లాడుతున్న డిఈఓ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:- విద్యాబోధనలో నైపుణ్యం కలిగించేందుకు ఉపాధ్యాయులకు మండల కేంద్రంలో మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో రెండో విడత టీచింగ్ ఎట్ ద రైట్ లెవెల్ (టార్ల్) శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సందర్శించి శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ మూడు రోజుల శిక్షణ అనంతరం పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని చెప్పారు. .ఈ కార్యక్రమంలో ఎంఈవో సుందరరావు, కామరాజు, రిసోర్స్ పర్సన్స్ సుబ్బారావు, రామారావు, శ్రీనివాసరావు, రమేష్, సీఆర్పిలు నాగేంద్ర, కాంతారావు, సింహబలుడు, కిరణ్, పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్లు

పింఛన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు

సిర్లపాలెంలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలో ఉదయాన్నే పింఛన్లు అందుకుందామని ఎంతో ఆశగా వచ్చిన వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులు పింఛన్ల పంపిణీ సర్వర్లు మొరాయించడంతో మధ్యాహ్నం వరకు పడిగాపులు పడక తప్పలేదు. ఉదయం నుంచి మొరాయించిన సర్వర్లు మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పని చేయడంతో సిబ్బంది పింఛన్లు అందజేశారు. దీంతో మండలంలో 93 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపిడిఒ వి.జానకి తెలిపారు.మండలంలో 26 పంచాయతీలలో 8765 మందికి పొద్దుపోయే వరకు సచివాలయ సిబ్బంది పింఛను అందజేశారు. ఉదయానికే చేరుకున్న లబ్ధిదారులు గంటల తరబడి వేచియుండడంతో పలువురు అసహనానికి గురయ్యారు.

హెచ్ఎం చొరవతో..

రవ్వలగూడ పాఠశాల అభివృద్ధి

- ఆహ్లాదకర వాతావరణం, నాణ్యమైన విద్య..
- రూ.10 లక్షల సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

ఉద్యానవనాన్ని తలపించే వాతావరణంలో ఉన్న రవ్వలగూడ పాఠశాల భవనం

ప్రజాశక్తి-అరకులోయ :అరకులోయ మండలం రవ్వలగూడ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ఒకటి దిన దినం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఈ పాఠశాలకు ప్రధాన ఉపాధ్యాయుడుగా హెచ్‌పి కెందు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పాఠశాలలో సమూలన మార్పు చేశారు.

పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన తో పాటు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు మధ్య స్నేహ పూర్వకమైన వాతావరణాన్ని కల్పించారు. క్రమశిక్షణతో కూడిన విద్య ఈ పాఠశాల సొంతం. క్రీడల్లో కూడా ఈ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ పాఠశాలలో మానవాళి మనుగడకు ఎంతో దోహదపడే నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కెందు ప్రత్యేక చొరవతో తన సొంత డబ్బులతో అనేక రకాల మొక్కలను కొనుగోలు చేసి పాఠశాల చుట్టూ వాటిని నాటి ఒక ఉద్యానవనాన్ని తలపించే విధంగా పెంపకం చేపట్టారు. దీంతో ఆ పాఠశాల సుందరంగా తీర్చిదిద్దబడి చూపరులను అమితంగా ఆకట్టుకుంటుంది. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కూడా సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ అధికారి రామ్మూర్తి తూచ తప్పకుండా అమలు చేస్తున్నారు. ఈ పాఠశాలలో రోడ్డు సమస్య ఉండడంతో ప్రధానోపాధ్యాయుడు కెందు ఉపాధ్యాయుల సహకారంతో సొంత నిధులు సుమారు 10 లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు ఇరువైపులా అందమైన మొక్కలను కూడా నాటి ఒక ఉద్యానవనంలా తయారు చేశారు. పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను తొలగించడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ పాఠశాల హెచ్ డబ్ల్యు ఓ(వార్డెన్) ఒక హెల్త్ అసిస్టెంట్ ను సొంతంగా నియమించుకొని తన జీతాల నుంచి ఆయనకి కొంత వేతనం చెల్లిస్తున్నట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పాఠశాల ఇరు వైపులోని గోడల్లో ప్రముఖుల చిత్రపటాలు, ప్రముఖ క్రీడాకారుల చిత్రపటాలు వేయించడంతో మరింతగా ఆకట్టుకుంటుంది. ఆర్వో ప్లాంట్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు మంచినీరు అందిస్తున్నట్లు ఆ పాఠశాల సిబ్బంది తెలిపారు. క్రీడా పోటీలు నిర్వహించి హెచ్ఎం, పీడి బహుమతులు అందజేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తుంటారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల రోజున ఈ పాఠశాల విద్యార్థులు నిర్వహించే సాహస విన్యాసాలు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న ప్రధాన ఉపాధ్యాయుడు అందరి మన్ననలు పొందుతున్నారు. హెచ్ఎం సేవలను గుర్తించిన చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ యూఎస్ఏ ఇండియా)కూడా ఇటీవల సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డు ఇచ్చి సత్కరించింది.

క్రమశిక్షణ, పర్యావరణం అంటే ప్రాణం

నాకు మొదటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్య నందించడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అలవాటు. పాఠశాలలో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దడం ప్రాణంగా భావిస్తాను. ఎక్కడికి వెళ్లినా ఆ స్కూలును ప్రత్యేకంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తుంటాను. సామాజిక కార్యక్రమాల్లో కూడా తాను పాలుపంచుకోవడం ఇష్టం.

-కెందు, హెచ్ఎం

ఐఏఎస్ అధికారి నుంచి ప్రశంస:

పాడేరు ఐటిడిఏ పీవో గా పనిచేసిన రోనంకి గోపాలకృష్ణ గతంలో రవ్వలగూడ పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఎటు చూసినా ఉద్యానవనాన్ని తలపించే విధంగా ఉన్న రకాల పూల మొక్కలు, సిసి రోడ్డు, గోడలపై ఉన్న ప్రముఖుల చిత్రపటాల చూసి ప్రధాన ఉపాధ్యాయుడు హెచ్ పి కెందును ప్రశంసించారు.

హెచ్ఎం కెందు సొంత నిధులతో పాఠశాలకు నిర్మించిన సిసి రోడ్డు

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

రంపచోడవరంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి- రంపచోడవరం :స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడత నవంబర్ నెల నుండి మార్చి నెల వరకు గ్యాస్ ఉచితంగా ఒక సిలిండర్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కొత్త గ్యాస్ కనెక్షన్ కోసం సచివాలయంలోగాని, యాప్‌లోగాని, ఆన్లైన్లో గాని అప్లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలోని 6 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 75,689 గ్యాస్ కనెక్షన్లకుగాను 59,903 మంది దీపం-2 (3 ఉచిత గ్యాస్ సిలిండర్) పథకానికి అర్హులుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఎవరికైనా గ్యాస్ సిలిండర్ కు చెల్లించిన డబ్బులు అకౌంట్లో జమ కాకుంటే ఎంపీడీవోలను సంప్రదించాలని కోరారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ ఉచిత గ్యాస్‌కు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్, గ్యాస్ కనెక్షన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ చేతులు మీదుగా ఉచిత గ్యాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె. బాలకృష్ణ, ఎంపీటీసీ వి.లక్ష్మి, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, తహశీల్దారు ఏవీఎస్ సత్యనారాయణ, ఎంపీడీవో ఎస్ శ్రీనివాసరావు, ఏఎస్ఓ విజయభాస్కర్, ప్రజా ప్రతినిధులు అడబాల బాపిరాజు, కారం సురేష్, పివై. నిరంజనీదేవి, అనంత మోహన్, కారం సింహాచలం, పండా చెల్లన్న దొర, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం, బాలారం గ్రామాల్లో దీపం -2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో జిసిసి మాజీ చైర్మన్ యంవివి ప్రసాద్, సర్పంచ్‌లు అప్పలనరస, పీట సింహాచలం, బాలరాజు, వెంకటలక్ష్మి, మాజీ జెడ్పిటిసి గాడి శ్రీరామూర్తి, టిడిపి నాయకులు రమణ, వరహాలు బాబు, అన్నవరం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఉచిత గ్యాస్ పథకాన్ని వినియోగించుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు టి సుబ్బారావు అన్నారు. మండల కేంద్రంలోని గ్యాస్ గోడౌన్‌లో ఉచిత గ్యాస్ ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. గిరిజన మహిళ లబ్దిదారులకు గ్యాస్ బండలను పంపిణీ చేశారు.గిరిజన కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మండల నాయకుడు సింహాద్రి పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఈ స్కూటీ ఎవరిదో ?

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రహదారిని ఆనుకొని పెదగదిలి అంబేద్కర్ విగ్రహం ఆవరణలో ఎపి 30డిఎస్ 9018 నెంబరుగల స్కూటీ గత 20 రోజులుగా పార్కింగ్ చేసి ఉంది.ఈ ద్విచక్రవాహనం హ్యాండిల్ లాక్ వేయకుండా ఉంది. ఈ విషయాన్ని పోలీసు నేర విభాగం పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణునికి పదవిపై హర్షం

ప్రజాశక్తి- వేపగుంట : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో సభ్యునిగా కుప్పం నియోజకవర్గానికి చెందిన నాయీ బ్రాహ్మణుడు వైద్యం శాంతారామ్ స్థానం కల్పించడంపై విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు నరవ పైడిరాజు హర్షం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఇతర టిడిపి ముఖ్యనేతలకు ధన్యవాదాలు తెలిపారు. మిగతా దేవాలయాల కమిటీలు, కార్పొరేషన్లలో నాయీబ్రాహ్మణులకు మరింత ప్రాధాన్యతనివ్వాలని కోరారు.

డెమో క్లాసుల తీరును పరిశీలిస్తున్న డిడి జాన్ రాజు

గెస్ట్ టీచర్ అభ్యర్థుల డెమో క్లాసులు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏకలవ్య పాఠశాలల్లో గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల నుండి స్థానిక గురుకుల పాఠశాలలో శుక్రవారం డెమో క్లాసులు తీసుకోవడం జరిగిందని గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజు తెలిపారు. ఈ డెమో క్లాసులకు సుమారుగా 85 మంది అభ్యర్థులు హాజరయ్యారని, తెలుగు, హిందీ, ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులలో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ ద్వారా డెమోలు తరగతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ డెమోలలో ఎంపికైన అభ్యర్థులకు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ట్రైబర్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, గురుకులం కన్వీనర్, ప్రిన్సిపల్ అలీషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం, పట్టుదల, వ్యక్తిత్వ వికాసం కలిగి ఉండే విద్యార్థులంతా ఉన్నత శిఖరాలను చేరుకుంటారని రాజహేంద్రవరం రామకృష్ణ మిషన్, వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ డైరక్టర్ స్వామి సేవ్యానందజీ పేర్కొన్నారు. రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎపి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (బాలురు) విద్యార్థులకు వేరువేరుగా వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, జీవితం పై సానుకుల దృక్పథం పెంపొందించాడానికి స్వామి వివేకానంద జీవితం గురించి వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, ఎపి రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీ (బాలురు) ప్రిన్సిపాల్ ఈడ శ్రీనివాసరావు, అధ్యాపక బృందం ఇంజనీర్ బిఆర్ఎస్.శ్రీకాంత్, రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, అప్పలశ్రీనివాస్, రోహిత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సిఆర్‌పిఎఫ్ పోలీసులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం సి42 బెటాలియన్ ఇన్స్‌స్పెక్టర్ ధర్మసింగ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో శ్రేయస్కరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావితరాల రక్షణఖు తమ వంతు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ, సైనిక్ స్కూల్ నమూనా పరీక్షలు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల-1లో నవోదయ, సైనిక్ స్కూల్ నమూనా ప్రవేశ పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ పరీక్షలకు 50 మంది విద్యార్థులు హాజరైనట్లు ది రేస్ అకాడమీ వ్యవస్థాపకులు ఎస్ రామచంద్ర రాజు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. కొయ్యూరు, రాజవొమ్మంగి మండలాల నుండి పలువురు విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష ఫలితాలను ప్రకటించారు. సీనియర్ విభాగంలో కాటా మానస, కె మేరీ జాస్మిన్, ఎం హిమబిందు, రాజ్యలక్ష్మి, కే హైమావర్షిని, తేజ, జూనియర్ విభాగంలో సిహెచ్ తేజశ్రీ మెహర్, వి లక్ష్మణ సాయి, సుప్రియ సాయి, జే చిన్న విజేతలుగా నిలిచారు. వారికి ది రేస్ అకాడమీ ఎస్ రామచందర్ రాజు చేతులు మీదుగా మెడల్స్ అందజేశారు.

నేడు విశాఖకు చంద్రబాబు

కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల సమీక్ష

సుందరంగా కలెక్టరేట్ ముస్తాబు

స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్ సహా కీలక అంశాలపై సిఎం స్పందించేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖకు శనివారం విచ్చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అధికారులు సన్నద్ధమయ్యారు. జిల్లా కలెక్టరేట్‌లోని భవనాలు, ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ఇప్పుడిప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని పనులకు కూటమి సర్కారు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో విశాఖ కూడా ముఖ్యమైనదిగా ఉంది. విశాఖను ఆర్థిక రాజధానిగా చేసేందుకు కృషి చేస్తామంటూ పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు గతం నుంచీ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు రాక విషయమై ఈ ప్రాంత ప్రజానీకం అనేక ఆశలతో నిరీక్షిస్తోంది.

1356 రోజులుగా ఉక్కు పోరాటం

ఆంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర జీవనాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్దంటూ 1356 రోజులుగా కార్మికలోకం, ప్రజానీకం ఉద్యమిస్తోంది. ఎన్నికలు ఫలితాలొచ్చి ఐదు నెలలు అవుతున్న క్రమంలో చంద్రబాబు విశాఖకు వస్తున్నందున స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులే కాకుండా విశాఖ ప్రజానీకం సైతం స్టీల్‌ప్లాంట్‌పై బాబు ఏం ప్రకటన చేస్తారోనన్న ఉత్కంఠతో ఉన్నారు. ఇప్పటికే స్టీల్ ఉద్యోగులమీద యాజమాన్యం, అటు కేంద్రంలోని బిజెపి తీవ్ర ఆర్థిక దాడులకు పాల్పడుతూ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తోన్న నేపథ్యంలో ప్లాంట్ వరకూ చంద్రబాబు స్పందన ఎలా ఉంటుందోన్న చర్చ నడుస్తోంది. పంచగ్రామాల సమస్యపైనా సిఎం ఏం మాట్లాడతారోనన్న ఆసక్తి అందరిలో ఉంది.

ప్రాజెక్టులకు మోక్షం లభించేనా ?

విశాఖ అంటేనే అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలకు నిలయం. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ భవన శంకుస్థాపన ఏనాటి నుంచో జాప్యం జరుగుతోంది. ఈ డిసెంబరు నెలాఖరులోపు కేంద్రం దీనికి పునాదిరాయి వేసి పనులు చేపట్టనుందన్న అంశాన్ని చంద్రబాబు చెప్పే అవకాశాలున్నాయి. విశాఖకు మెట్రో సహా పలు రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌లు (ఫ్లై ఓవర్ బ్రిడ్జిలతో సహా) నిర్మాణం జరిగితేనే ట్రాఫిక్ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. విశాఖ కేంద్రంగా టిసిఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే ఐటి మంత్రి నారా లోకేష్ ప్రకటన చేశారు. 10 వేల మందికి ఇక్కడే ఐటి ఉద్యోగాల హామీ కూడా లభించింది. ఇవన్నీ సాకారం కావాలన్న కాంక్ష విశాఖ యువత నుంచి వ్యక్తమవుతోంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల్లో జాప్యం

విశాఖపట్నం జిల్లాకు సంబంధించి నాలుగు క్వార్టర్ల స్కాలర్‌షిప్‌లకుగానూ ఒక్క క్వార్టరే గతంలో వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కటంటే ఒక్క క్వార్టరుకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదు. 2023-24 బకాయిలు 3 క్వార్టర్‌లు ఉండిపోయాయి. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ జిల్లాకు సంబంధించి సుమారు రూ.4 కోట్లు పెండింగులో ఉండిపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అవస్థలకు గురౌతున్నారు. తమ పిల్లలను కష్ట, నష్టాల నడుమ చదివించుకుంటున్నామని, తమపై విద్యాసంస్థల యాజమాన్యాల తీవ్ర ఒత్తిడి ఉందని వారంతా వాపోతున్నారు. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆగిపోవడంపై వారు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

బాబు పర్యటన ఇలా..

ఎంవిపి.కాలనీ : సిఎం చంద్రబాబు శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు గజపతినగరం నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి 1.05కి విశాఖపట్నం కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అక్కడి నుంచి 1.10 గంటలకు బయలుదేరి 1.15కి విశాఖపట్నం కలెక్టరేట్‌కు వస్తారు. అనంతరం అక్కడ మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటల వరకు ఉత్తరాంధ్ర జిల్లాల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 4.35 గంటలకు విశాఖపట్నం కలెక్టరేట్ నుండి బయలుదేరి 4.40 గంటలకు నేవీ కోస్టల్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకొని, అక్కడి నుండి ప్రత్యేక హెలీకాప్టర్‌లో 4.45 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అనంతరం అక్కడ నుంచి 5.05 గంటలకు విమాన మార్గంలో సాయంత్రం 6.00 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఈ మేరకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

ప్రజాశక్తి-రంపచోడవరం

అమరవీరుల స్ఫూర్తితో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. నక్సలబరి శ్రీకాకుళం, గోదావరిలోయ ప్రతిఘటన పోరాటాల్లో అమరులైన వారికి నివాళులర్పిస్తూ కాకవాడ గ్రామంలో అమరుల స్థూపం వద్ద శుక్రవారం సంతాపసభ జరిగింది. బజ్జల బుజ్జ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా నాయకులు పి వెంకటనాయుడు, జె సత్తిబాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, కర్షక, విద్యార్థులపై దాడులు ముమ్మరం చేసిందన్నారు. దోపిడీ లేని సమాజం కోసం పాటుపడుతున్న విప్లవ నాయకులను బిజెపి ప్రభుత్వం నక్సలైట్ల పేరుతో కాల్చి చంపుతుందని ఆరోపించారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి అడ్డువచ్చిన గిరిజనులను హతమార్చడం దారుణమన్నారు. కార్యక్రమంలో తునూరు పంచాయతీ సర్పంచ్ సాధల విజయ భాస్కర్ రెడ్డి, కత్తులు సోమిరెడ్డి, కుంట్ల పాపారావు రెడ్డి, కుర్ల రెడ్డమ్మ, రవ్వ పెంటన్నదొర, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల బాట ఏర్పాటు చేసుకుంటున్న గ్రామస్తులు

గెడ్డలో రాళ్ల బాట

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం, దారకొండ పంచాయితీ పరిధి నిమ్మచెట్టు గ్రామం వద్ద వాగులో గ్రామస్తులు శ్రమదానం ద్వారా రాళ్లు పేర్చి రాకపోకలకు వీలుగా మార్గం ఏర్పాటు చేశారు. నిమ్మచెట్టు వాగుపై వంతె లేక ఆ ప్రాంత గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు. దశాబ్దాలుగా ఈ వాగుపై వంతెన నిర్మాణం చేయడం లేదు. వంతెన నిర్మించాలని అనేకసార్లు అధికారులకు గ్రామస్తులు మొరపెట్టుకున్నా, పత్రికల ద్వారా తమ గోడును వెల్లబుచ్చినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్లేదు. సెప్టెంబరు 8న వచ్చిన వరద ఉధృతికి నిమ్మ చెట్టు వాగు కొట్టుకుపోవడంతో ఈ మార్గం మరింత అధ్వానంగా తయారైంది. కర్రల సహాయంతో గిరిజనులు వాగుదాటి దాటేవారు. అనారోగ్యానికి గురైనప్పుడు, రోగిని అతికష్టం మీద అవతల ఒడ్డుకు చేర్చేవారు. నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడేవారు. వాగుపై వంతెన నిర్మాణంపై అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేక గ్రామస్తులే స్వచ్ఛందంగా శుక్రవారం శ్రమదానంతో ద్విచక్ర వాహనాలు నడిచేలా తాత్కాలిక మార్గం నిర్మించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిమ్మ చెట్టు వాగుపై వంతెన నిర్మించి గిరిజన రాకపోకలు సాగించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంఆర్సి కార్యాలయంలో శుక్రవారం ఎంఈఓ కె సత్యనారాయణదొర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యం పెంపొందించేందుకు వీలుగా టీచ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 26 మంది ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 సూరారెడ్డి, సీఆర్పిలు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కిరాణా షాప్ దగ్ధమై మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వాతంగి గ్రామానికి చెందిన సరస్వతి కిరాణా షాపు నిర్వహిస్తుంది. దీపావళి పండుగ నేపథ్యంలో దీపాలు వెలిగిస్తుండగా కిరాణా షాపులో పెట్రోలు ఉండడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన కుటుంబీకులు మహిళను బయటకు తీసుకురాగా కిరాణా షాపు మొత్తం ఖాళీ బూడిదైంది. సంఘటనా స్థలాన్ని రాజబొమ్మంగి సీఐ ఎన్ సన్యాసినాయుడు, జడ్డంగి ఎస్ఐ చినబాబు పరిశీలించి ,సంఘటనకు సంబంధించిన వివరాలు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన మహిళ సరస్వతిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు.

ఎపి జెన్‌కో ఎస్ఇ రామభద్రరాజు బదిలీ

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్‌గా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టి రామభద్రరాజును పోలవరం ప్రాజెక్టుకు బదిలీ చేస్తూ ఏపీ జెన్కో విద్యుత్ సౌధా యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్థానంలో సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్‌గా కొనసాగుతున్న చంద్రశేఖర్ రెడ్డిని సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సీలేరు ఎస్ఈ సివిల్ కార్యాలయంలో ఇన్చార్జి ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇంజనీర్లు కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు.